కథానిక

# పారిపోయిన సత్యం

మొవ్వ రాంబాబు

మనం కొన్ని కొన్ని విషయాలు ఎవ్వరికీ చెప్పకూడదనుకున్నా వాటి దుంపతెగ అవి బయటికి వస్తూనే ఉంటవి. వాటిని చెప్పకుండా ఉండటానికి ఎంత ప్రయత్నించినా వాటి అంతట అవే బయటకి వస్తున్నట్టుగా ఎవరో ఒకరిద్దరికి చివరకి మనం చెప్తూనే వుంటాం. దీనిమీద మనస్తత్వ శాస్త్రవేత్తలు ఏవో వ్యాఖ్యానిస్తారు గాని, రహస్యాలను సహజంగా ఏ మానవుడూ తనలో ఎక్కువకాలం యిముడ్చుకోలేడు అని ఏమిటేమిటో చదువుకుంటూ, చదివిన దాని మీదట ఊహించుకుంటూ, ఉండగానే టకటక మనుకుంటూ సత్యం గదిలోకి వచ్చాడు. వాడిని చూడగానే నేను కొంచెం ఆశ్చర్యపడవలసి వచ్చింది.

'అప్పుడే వచ్చావేంరా?' అన్నాను.

'ఏముందక్కడ చేయటానికి?' అన్నాడు.

'అక్కడే ఉంటానంటివి కదరా?' అన్నాను.

వాడు మాట్లాడలేదు. సత్యం దాదాపు నాల్గైదు నెలలదాక రానని వెళ్ళాడు వాళ్ళ చిన్నమామయ్యగారి ఊరు. వెళ్ళిన ఒక నెల రోజులకే వచ్చేటప్పటికి నాకు నిజంగా ఆశ్చర్యం కలిగింది.

'అక్కడ ఒక్క నిమిషంకూడా ఉండలేక పోయానురా!' అన్నాడు.

'కర్మ కాలితే, ఏం జరిగింది?'

'ఏం జరగాలిరా? అంతా పూర్తయింది' అన్నాడు.

నాకేమీ అర్థంకాలేదు.

'చెప్పవోయ్ విసిగించకుండా.' అన్నా.

'ఇప్పుడు కాదులే' అంటూ ఏదో మాట్లాడబోయి మళ్లీ చప్పున ఊరుకున్నాడు. నాకు ఇదో చిదంబర రహస్యంగా తోచింది.

రెండుమూడు రోజులు కడచిన తర్వాత ఏదో మాటలసందర్భంలో మళ్ళీ అడిగాను. వాడు కొద్దిగానవ్వి 'ఒరే నీవు వింటే నవ్వుతావురా!' అంటూ 'మామయ్యగారి ఇల్లు చాలా పెద్దది. మండువా ఇల్లు. ఉత్తర దక్షిణాలు వాకిళ్ళు, దక్షిణం పంచపాళీ. ముందు విశాలమయిన స్థలం. ఇంకా ముఖ్యంగా వారి ఇంట్లో ఎవ్వరూ చిన్నపిల్లలులేరు. అందువల్లనే నేను వాళ్ళఊరు వెళ్లాను' అని అన్నాడు.

'అందుకనే వెళ్ళగానే తిరిగి వచ్చావు!!' అంటూ నవ్వుతూ ప్రశ్నించాను.

'ఇప్పుడు చిక్కు ఎక్కడ వచ్చిందంటే మా మామయ్యగారి ఇల్లు అప్పటికి ఇప్పటికి ఒక్కటిగానే ఉంది. కాని ఆ ఇంట్లోనే యింకొక కుటుంబం కూడా ఉంది. మా మామయ్యకి అన్నయ్య వరస అవుతాడట ఈ ఉంటున్న పెద్దమనిషి. కృష్ణాజిల్లాలో పెద్దరైతు. ఈయన పెద్దకొడుకుని ఎవరో చంపారు. అతను కాంగ్రెసు వాడని కమ్యూనిస్టులు చంపివుంటారని అందరూ నమ్ముతున్నారు. పోలీసువాళ్లే ఎక్కడకో తీసుకొని పోయి చంపివుంటారని కూడా నమ్మేవాళ్లు లేకపోలేదు. ఇంక అటువంటప్పుడు అక్కడే వుండటం బాగోదని భార్యని, పెళ్ళి కావలసిన కూతురుని విధవ కోడలుని వెంటపెట్టుకొని మా మామయ్యగారి ఊరు వచ్చి ఉంటున్నాడు వాళ్ళ ఇంట్లోనే' అని అంటూ ఇంకా ఏమో చెప్పబోతున్నాడు.

'నాకు తెలిసింది నీవు ఎందుకు వచ్చావో!' అన్నాను నవ్వుతూ.

'ఏమిటి నీమొఖం నీకు తెలిసింది? వాగకుండా వినూ' అంటూ మళ్లీ మొదలుపెట్టి చెప్పాడు.

'వాళ్ళు వేరే ఉంటున్నారన్న మాటేగాని అంతా ఒక్కటే. మా మామయ్యగారికీ వారికీ నడుమ ఏ విధమైన అరమరికలు లేవు. రైతుగారు సుమారు యాభై సంవత్సరాల వయసు

వాడు. పేరు రామలింగయ్యగారు. చాలా మంచివాడు.'

రామలింగయ్యగారి కూతురు మంచి అందమైన పిల్ల. పదిహేడు సంవత్సరాల వయస్సు. సన్నగా అతి కోమలంగా ఉంటుంది. చక్కని పెదవులు. బారుగాడే వాలు జడ. చూడటానికి చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. పేరు పార్వతి. ఆ అమ్మాయికి ఇంకా పెళ్ళి ఎందుకు కాలేదోనని నేను ఆరాతీస్తే చదువుకుంటున్నదని చెప్పారు' అన్నాడు.

'అయితే రొట్టెముక్క నేతిలో పడిందన్న మాట' అన్నాను.

'సాంతంగా వినవోయ్' అంటూ మళ్ళీ, 'ఇంతకీ ఎక్కడ వచ్చిందంటే చిక్కు, ఆ యింట్లో రామలింగయ్యగారి కోడలు వెధవామె కూడా ఉంటుందని చెప్పానే, ఆమె పేరు వరలక్ష్మి. ఆమెకి ఇరవై సంవత్సరాలుంటాయి. ఒక చిన్న పిల్లవాడు. ఛాయ చామనచాయి. కొద్దిగా బండ మొఖం. మొగుడు చనిపోయాడని యింకా రోజూ ఏడుస్తూ ఉంటుంది. గాజులుమాత్రం తీసివేసిందిగాని తక్కిన విషయాల్లో మామూలుగానే ఉంది. ఈమెకూ పార్వతికీ ఒక్క క్షణం పడదు. ఈమెకూడా చదువుకున్నదే. అయితే పార్వతికి ఇంగ్లీషుకూడావచ్చు, ఈమెకు రాదు. ఇద్దరికీ తేడా ఏమిటంటే పార్వతి ఎప్పుడూ నవ్వుతున్నట్టుగా కిలకిల లాడుతున్నట్లుగా ఉంటుంది. ఈమె విచారంగా ఉన్నట్లుగా మాట్లాడకుండా ఉంటుండేది. వరలక్ష్మమ్మగారి ఇంకొక్క ధీమా ఏమిటంటే తన మొగుడు దేశంకొరకు కమ్యూనిష్టుల చేతిలో బలిఅయ్యాడని ఆమెకుగర్వం. ఆ విషయాన్ని ఆమె ప్రచారం చేసుకుంటుంది. ఈ మాట అంటే పార్వతికి మంట. పైగా వరలక్ష్మమ్మ వస్తూవస్తూ చాలా కట్నం తెచ్చింది. ఈ అలుసు తీసుకొని ఆమె ఇంట్లో అధికారం చెలాయిస్తుండేది. విద్యావంతురాలయిన పార్వతికి ఇది గిట్టేదికాదు. వీరిద్దరిమధ్యా తగాదాలను పార్వతివాళ్ళ అత్త తీరుస్తుండేది' అన్నాడు.

'వాళ్ళ పోట్లాటలు సరే. ఇందులో నీ జోక్యం ఎంతవరకు? 'అన్నాను.

'మన పార్వతి ఏమిటంటే, నేను పోగానే నేను ఏదో కాలేజీ విద్యార్థి అనుకున్నారుగాని ఆనర్సు క్లాసు అని అనుకోలేదు. ఒకరోజున నన్ను చదువుకోటానికి పుస్తకం ఇవ్వమన్నది పార్వతి. నాపెట్టె తెరచి అన్నీ చూసింది ఏ పుస్తకమూ అర్థం కాలేదు.

'ఏమండీ మీ రే క్లాసు, ఎక్కడ చదువుతున్నారో చెప్పరూ!' అంది.

'ఏక్లాసో తెలుసుకోవలసినంత ఇబ్బంది ఎందుకు? ఇవి అన్నీ కామర్సు పుస్తకాలు. నీకు పనికిరావు' అన్నాను.

పార్వతి అప్పటినుంచీ నాతో ఇంకా ఎక్కువ చనువుగా ఉండటం మొదలుపెట్టింది. నేనంటే అభిమానం అని కూడా తెలిసింది. కాని ఏమి చేయటానికీ వీలులేకపోయింది. అవతల రామలింగయ్యగారు చాలా పెద్దమనిషి. ఆయనకుగాని మా మామయ్యకు గాని తెలిసిరా ప్రాణం నిలువునా పోయిందనే చెప్పాలి. పార్వతి నాతో పాటు తిరిగేది, చదువుకునేది, నాకు కబుర్లు చెప్తూండేది' అన్నాడు.

'అయితే అదృష్టవంతుడివే' అన్నాను.

'తగ్గు తమ్ముడూ తగ్గూ!' అంటూ మళ్ళా 'చిక్కు ఏమిటంటే మే మిద్దరం చనువుగా ఉండటం వరలక్ష్మమ్మగారికి ఇష్టం లేదు. ఎవ్వరికీ భయపడ నవసరం లేకపోయినా ఆమెకు జడియ వలసి వస్తోంది ఇప్పట్లో. వరలక్ష్మమ్మగారు నాకు మధ్యాహ్నం టీ తయారు చేసి ఇస్తూండేది బాగానే చేస్తుంది. 'చాలా బాగున్నదండీ' అని ఒకరోజున అన్నాను. ఆమె నావంక చూచి నవ్వింది. ఆ నవ్వు ఆమెలో అణిచిన ఏవో కోర్కెలను మళ్ళీ బయటకు వెళ్ళ గక్కుతున్నట్లుగా ఉన్నది. రోజూ చక్కగా నా పుస్తకాలు బట్టలూ అన్నీ సర్ది శుభ్రంగా ఉంచేది. నాతో ఒంటరిగా మాట్లాడడానికో, మరి దేనికో ఆమె అభిలషించేది. నన్ను చూసి ఆమె ఎందుకనవ్వేదో నాకు అంతు తెలియ లేదు. నేను తీసుకొనిపోయిన చొక్కాలలో గీరల చొక్కా ఒకటి చిరిగి పోతే వంకెకి తగిలించాను. మరునటిరోజు ప్రొద్దున మళ్ళా చూస్తే అది కుట్టివుంది.

'పార్వతీ! నాచొక్కా కొంచెం కుట్టి పెడతావా!' అన్నాను.

'నాకు చాతకావండీ' అంది.

'మరి ఏమి చాతవుతుంది' అన్నాను. ఆమె కిలకిలా నవ్వింది.

'పో పిచ్చిపిల్లా' అంటూ చెయ్యిపట్టుకుని బయటకు పంపించేశాను.

'పోకపోతే తలకొట్టి మొలవేస్తావా?' అని నా మొఖంలో మొఖంపెట్టి నవ్వుతూ వెళ్ళిపోయింది. ఇంతదూరం వచ్చినాక ఇంక దీనిలో చెప్పాలిసింది ఏముంది. వరలక్ష్మమ్మగారికికూడా నామీద ఇంత అనవసరమయిన అభిమానం ఎందుకా అని నాలో నేను తర్జనభర్జన చేసుకున్నాను కాని ఏమీ తేలలేదు. ఇంకో ముఖ్య విషయ మేమిటంటే ఆవరలక్ష్మమ్మగారే నేనూ పార్వతీ ఒక్కచోట ఉన్నామంటే కొంచెం మొఖం చిట్లించేది. ఒకరోజు మధ్యాహ్నం గదిలో మగతగా నిద్రపోతున్నాను. చదువుతున్న పుస్తకం మొఖంమీద పడిఉంది. ఇంతలో పార్వతివచ్చి మొఖంమీద పుస్తకంతీసి భుజం మీద తట్టి లేపింది.

'ఏదైనాపని చేసిపెట్టమంటే చదావాలంటారు. తీరా మాస్తే ఇరవయినాలుగు గంటలూ నిద్రపోతారు!' అంటూ నవ్వింది.

వరలక్ష్మమ్మగారు టీ పట్టుకు వస్తున్నదల్లా మమ్మల్ని చూడగానే వాకిలిదగ్గరే ఆగి వెనక్కు వెళ్ళిపోయింది.

'ఆమెకు అంత కష్టంగాఉంటే నేను తెస్తాను ఉండండి' అంటూ పార్వతి వెళ్లి తీసుకొస్తే ఇద్దరం త్రాగేశాం.

'మేంఇద్దరం స్నేహితంగా ఉండటం చూచాయగా రామలింగయ్య గారికి తెలిసిందనుకుంటాను' అన్నాను సత్యం.

'తరువాత ఏం జరిగింది?' అని అన్నాను.

'ఆవిషయం గడచిపోయిన తరువాత సరిగ్గా ఒక వారంరోజులకి అంటే నేను వచ్చేరోజు క్రిందటిరాత్రి అన్నమాట. త్వరగాపడుకున్నాను. పార్వతిని గురించి, సెప్టెంబరు పరీక్షలయినాక ఏమి చేయబోయేదీ, ఏమి చేయటానికి వీలుగా ఉండేదీ- ఇవి అన్నీ ఆలోచించుకుంటూ సెప్టెంబరు పరీక్షల్లో క్లాసులో ప్యాసయినట్లుగానే అనుకుంటూ నిద్రపోయాను. ఒక ఝాముకల్లా ఎందుకో మెలకువ వచ్చింది. ఏమిటో నాకు తెలియలేదు. వెచ్చని చెయ్యి ఒకటి నా పెదవులమీద ఉంది. నాపక్కలో ఎవ్వరో ఉన్నట్లుగా గ్రహించాను. నామీద ఉన్న ఆ చెయ్యి తీసివేశాను గాని ఆమె రెండు చేతులతోనూ నా కంఠాన్ని పెనవేసింది నన్ను తనవైపుకు లాగుకుంది.' అన్నాడు సత్యం. కొద్దిసేపు మాట్లాడలేదు.

నాకు ఆశ్చర్యం వేసింది. 'నువ్వు ఏం చేశావు?'

కొద్దిగా నవ్వి 'నేను చేసేదేముంది? నా పక్కలో బరువుగా గాలిపీలుస్తూఉన్న వ్యక్తి పార్వతి అని గ్రహించాను. పెద్దమనుష్యుల గౌరవాలు సాంప్రదాయాల కోసమని ఆమెను ప్రక్కలోనుంచి వెళ్ళగొట్టలేను. ఇంతదూరం ఆమె సున్నితహృదయానికి బాధ కలిగించ దలుచుకోలేదు. పార్వతిని గురించి నేను అనుకుంటున్నదే అది. ఆమెకోర్కె నెరవేర్చాను.

ఆమె నెమ్మదిగా నిశ్శబ్దంగా బయటకు వెళ్లిపోయింది. ఒక నిట్టూర్పువిడచి; ఎంత విచిత్రం అని నాలో నేను అనుకున్నాను. పార్వతి ఎప్పుడూ వాళ్ళ అమ్మ, నాన్న వాళ్ల మంచాల వద్ద పడుకుంటుంది. వరలక్ష్మమ్మగారు వేరే ఇంకొక గదిలో పడుకుంటుంది, తన పిల్లవాడితోసహా. ఆమె అప్పుడప్పుడూ నిద్ర సరిగ్గా పట్టటంలేదని అంటూండేది. నాకు చప్పున ఒకటి జ్ఞాపకంవచ్చింది. నన్ను కౌగిలించుకున్నప్పుడు ఆమెకు గాజులు లేవు. అది మాత్రం నిజం. అప్పుడు నేను గ్రహించలేదు!' అన్నాడు సత్యం.

ఒక సిగరెట్టు వెలిగించి మళ్లీ 'అటువంటి పరిస్థితుల్లో ఇటువంటివి అన్నీ గమనించం! అది కటిక చీకటి. పైగా ఆమె వెళ్ళేప్పుడు బయటకు వెళ్లిపోయింది నాగదిలోనుంచి' అన్నాడు.

నాకు నవ్వు ఆగలేదు.

'నేను మొదటనే చెప్పానురా. నువ్వు వింటే నవ్వుతావని. నాగదిలోకి వచ్చింది నిజానికి వరలక్ష్మి. ఆమె ఎప్పుడయితే బయటికి వెళ్లిపోయిందో నాకు అప్పుడే అనుమానంవేసింది. బయటగదిలోనుంచి ఆమెగదిలోనికి రావచ్చు. పార్వతి అయితే అట్లా రావటానికి వీలులేదు. దేశంకోసం ప్రాణాన్ని త్యాగంచేశాడని చని

పోయిన తన మొగుణ్ని గురించి విచారిస్తూన్నట్లుగా ఉండేది వరలక్ష్మమ్మ. ఆమెను చూస్తే జీవితంలో ఆశలన్నీ నశించిన మనిషివలె అగుపడుతుంది' అన్నాడు.

'ఒకళ్లు నీ ప్రక్కలో ఉంటే, ఇంకొకరని ఎట్లా అనుకుంటున్నావురా?' అన్నాను నవ్వుతూ.

'అటువంటి పరిస్థితుల్లో ఎవరైనా అంతేరా! పార్వతి అని అనుకోవటంలో పొరపాటూ ఏమీ లేదు. పార్వతి నాతో చాలా కొంటెగా ఉంటుంది. నన్ను నవ్విస్తుంది. చాలా చాలా గోల చేస్తుంది. వరలక్ష్మమ్మగారికి నామీద ఆశ ఉన్నదని నేను ఎన్నడూ అనుకోలేదు. అప్పటికప్పుడే పుస్తకాలూ, బట్టలూ అన్నీ సర్ది ప్రొద్దున్నే మామయ్యని లేపి చెప్పి మెయిలెక్కి వచ్చేశాను' అన్నాడు.

నేను నవ్వుతూనే ఉన్నాను. 'అరే ఇది నువ్వు ఆలోచించుకుంటే నీకు నవ్వు రావటం లేదురా!' అన్నాను.

'ఇప్పుడు రావటం లేదురా, కొన్నాళ్లు పోయినాక ఏమో చెప్పలేనుగాని! ఇంక ఆ ఊరు వాళ్ళుండగా వెళ్ళకూడదు. వరలక్ష్మమ్మ తన మొఖాన్ని ఇంక ఎట్లా చూపుతుంది? పాపం పార్వతి ప్రొద్దున్నే చక్కగా అలంకరించుకొని డ్రాయరుమీద కూజాలో పెట్టటానికి పూలగుత్తి పట్టుకొని వస్తుంది. నాతో మాట్లాడటానికి. ఇవ్వాళ నేను లేక పోవటం చూసి ఏమనుకుంటుందో!' అన్నాడు.

'అంత ప్రేమగా ఉంటే మళ్ళా ఒక్కసారి పోయి చూచిరా' అన్నాను.

'ఇంకా ఆ ఊరు వెళ్ళటమే!' అన్నాడు వాడు.

సత్యం ఇంకా ఆ విషయాలు ఏవీ ఎత్తకుండా అసలు తలుచుకోకుండా ఉన్నట్లుగా చదువు చదువుతున్నాడు. ఈ తడవ ఫస్టు క్లాసులో ప్యాసవుతాడని నాకు గట్టిగా తోచింది.

* * *

పదిహేను రోజులు అయినాక ఒక రోజున రామలింగయ్యగారూ వాళ్ళమామా మా రూముకి వచ్చారు. ఇద్దరినీ చక్కగా సత్కరించాను. వాళ్ళ మామయ్య సత్యం పరీక్షలని గురించి నన్ను అడిగాడు.

అన్నీ సరిగ్గానే చెప్పాను.

సత్యం మామయ్య నాతో ఇట్లా అన్నాడు: 'రామలింగయ్యగారు వారి అమ్మాయి పెళ్ళి ప్రయత్నంలో ఉన్నారు. ఇంతలో కమ్యూనిస్టు గొడవలవల్ల ఇక్కడకు రావలసి వచ్చింది. మొన్న మనవాడూ అక్కడ ఉన్నప్పుడు చూచాము, వాళ్ళిద్దరికీ ఈడు జోడు చక్కగా కుదిరింది. నీ సలహా ఏమిటి?'

నాలో నేను నవ్వుకున్నాను.

సరిగ్గా పదిహేను రోజులు గడవకముందే సత్యానికీ పార్వతికీ పెండ్లైంది. వాళ్ళిద్దరూ నా రూముకి దగ్గరలోనే ఒక ఇంట్లో ఉంటున్నారు.

మొన్న వాళ్ళ ఇంటికి వెళ్ళేటప్పటికి వాళ్ళిద్దరూ కాఫీ త్రాగుతున్నారు క్రింద గ్లాసు పెట్టి గజము ఎత్తున ఇంకొక గ్లాసులో నుంచి కాఫీ పోస్తోంది పార్వతి.

నన్ను చూడగానే, 'మీ స్నేహితుడు మళ్ళా మా కెవ్వరికీ చెప్పకుండా పారిపోవాలంటున్నాడండి. మీరు కొంచెం జాగ్రత్త చేయాలి!' అంది. నేనూ సత్యం ఒకళ్ళ మొఖం ఒకళ్ళం చూసుకున్నాము.

"నాకో యిల్లు సంపాదించి పెట్టగలవా?"

"హోటల్లో కాలక్షేపం చేస్తున్నవాడివి అంత అర్జంటుగా నీకు యిల్లెందుకూ?"

"ఈమధ్యనే పెళ్ళి చేసుకున్నాను."

"ఇంకేం! మామగారి యింట్లోకి మకాం మార్చెయ్!"

"లాభం లేదు. మా మామగారు ఆయన మామగారి యింట్లో ఉంటున్నాడు."